భారత రాజ్యాంగం

గ్రూప్-2 పరీక్షలో మొత్తం మూడు పేపర్లలో రెండో పేపర్‌లో రెండో సెక్షన్‌లో భారత రాజ్యాంగంలోని ముఖ్యాంశాలను ఐదు చాప్టర్లుగా సిలబస్‌లో నిర్దేశించారు. ఇందులో భారత రాజ్యాంగ ఆవిర్భావం గురించి నేరుగా పేర్కొన లేదు. అయినప్పటికీ ఒక పేపర్‌లో సగభాగం భారత రాజ్యాంగ సంబంధిత అంశాలకే కేటాయించారు. మొదటి పేపర్‌లో చరిత్ర భాగంలో రాజకీయ, జాతీయోద్యమ అంశాలను ప్రత్యేకంగా చేర్చారు. అందువల్ల రాజ్యాంగ ఆవిర్భావంపై అభ్యర్థులు దృష్టిపెట్టాలి.

ప్రపంచంలోనే భారత రాజ్యాంగం విశిష్టమైంది. దీన్ని రాజ్యాంగ సభ తయారు చేసింది. 1946 నవంబర్‌లో క్యాబినెట్ మిషన్ ప్రణాళిక ప్రకారం రాజ్యాంగ సభను ఏర్పాటు చేశారు.

రాజ్యాంగ పరిషత్ సభ్యులకు పరోక్ష పద్ధతిలో జరిగిన ఎన్నికల అనంతరం.. డిసెంబర్ 9, 1946న 389 మంది సభ్యులతో రాజ్యాంగ సభ మొదటిసారి సమావేశమైంది. రాజ్యాంగ సభ పూర్తికాలం అధ్యక్షుడిగా డాక్టర్ రాజేంద్రప్రసాద్ డిసెంబర్ 11, 1946న ఎన్నికయ్యారు. పాకిస్తాన్ ఏర్పాటు కావడం వల్ల రాజ్యాంగ సభ సభ్యుల సంఖ్య కూడా తగ్గి, డిసెంబర్ 31, 1947 నాటికి 299కి చేరుకుంది. ఈ సభ వివిధ కమిటీల సహాయంతో 165 రోజులు సమావేశాలు నిర్వహించి, నవంబర్ 26, 1949 నాటికి రాజ్యాంగ రచనను పూర్తిచేసింది. కాంగ్రెస్ మొదటి స్వాతంత్ర్య దినోత్సవంగా జనవరి 26, 1930న నిర్వహించుకున్న సందర్భానికి గుర్తుగా జనవరి 26, 1950 నుంచి రాజ్యాంగం అమల్లోకి వచ్చింది. దాంతో భారతదేశం గణతంత్ర రాజ్యంగా అవతరించింది. నవంబర్ 26, 1949న రాజ్యాంగ సభే తాత్కాలిక పార్లమెంట్‌గా రూపాంతరం చెంది, మొదటి సార్వత్రిక ఎన్నికల (1952) వరకు కొనసాగింది.

పోటీ పరీక్షల్లో ఈ అంశం నుంచి వచ్చిన ప్రశ్నలు.

1. సెప్టెంబర్ 2, 1946న ఏర్పాటైన తాత్కాలిక ప్రభుత్వాన్ని మొదటిసారి ప్రతిపాదిం చింది?

(గ్రూప్-2, 2008)

ఎ) సైమన్ కమిషన్ బి) క్రిప్స్ మిషన్
సి) వేవెల్ ప్లాన్ డి) క్యాబినెట్ మిషన్ ప్లాన్

(డి)

1946 మార్చిలో మన దేశంలో పర్యటించిన క్యాబినెట్ మిషన్ ప్రణాళిక ఆధారంగానే రాజ్యాంగ పరిషత్తు, తాత్కాలిక ప్రభుత్వాలు ఏర్పాటయ్యాయి. ఈ క్యాబినెట్ మిషన్‌లో ఏవీ అలెగ్జాండర్, పెథిక్ లారెన్స్, స్టాఫర్డ్ క్రిప్స్ సభ్యులుగా ఉన్నారు.

2. భారత రాజ్యాంగ రచన కమిటీ చైర్మన్?

(గ్రూప్-2, 2003)

ఎ) బీఎన్ రావు బి) డాక్టర్ బీఆర్ అంబేద్కర్
సి) కెఎం మున్షీ డి) డాక్టర్ రాజేంద్రప్రసాద్

(బి)

రాజ్యాంగసభ ఆగస్టు 29, 1947న రాజ్యాంగ రచన సంఘాన్ని (డ్రాఫ్టింగ్ కమిటీ) ఏర్పాటు చేసింది. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ చైర్మన్‌గా ఉన్న ఈ సంఘంలో ఆరుగురు సభ్యులు ఉన్నారు. ఈ సంఘం రాజ్యాంగ ముసాయిదాను డాక్టర్ రాజేంద్రప్రసాద్‌కు ఫిబ్రవరి 21, 1948న సమర్పించింది.

3. భారత రాజ్యాంగ నిర్ణయ సభ మొదటి సమావేశం ఎప్పుడు జరిగింది? (ఏఎస్ఓ 2008)

ఎ) డిసెంబర్ 6, 1946 బి) డిసెంబర్ 9, 1946
సి) నవంబర్ 30, 1946 డి) నవంబర్ 3, 1946

(బి)

4. భారతదేశంలో రాజ్యాంగ పరిషత్తు ఏర్పాటుకు సిఫార్సు చేసింది?

ఎ) మౌంట్ బాటన్ ప్రణాళిక బి) క్రిప్స్ మిషన్
సి) క్యాబినెట్ మిషన్ ప్రణాళిక
డి) భారత ప్రభుత్వ చట్టం 1935

(సి)

సిలబస్‌లోని మొదటి చాప్టర్‌ను రాజ్యాంగం ప్రముఖ లక్షణాలు, ప్రవేశిక, ప్రాథమిక విధులు, ప్రాథమిక హక్కులు, రాజ్యవిధాన ఆదేశిక సూత్రాలు, వాటిసంబంధం అనే అంశాలుగా విభజించవచ్చు.

భారత రాజ్యాంగ ముఖ్య లక్షణాలు

భారత రాజ్యాంగ సభ అధ్యక్షుడు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తో నవంబర్ 26, 1949న భారత రాజ్యాంగం ఆమోదం పొందింది. జనవరి 26, 1950లో రాజ్యాంగం అమలులోకి వచ్చే నాటికి 395 ఆర్టికల్స్, 10 షెడ్యూళ్లు ఉన్నాయి. అమెరికా రాజ్యాంగం కంటే దాదాపు ఐదు రెట్లు పెద్దది. ప్రపంచంలోని లిఖిత రాజ్యాంగాల్లోనే పెద్దదిగా గుర్తింపు పొందిన మన రాజ్యాంగ ముఖ్య లక్షణాలు:

1) సుదీర్ఘ రాజ్యాంగం
2) ప్రవేశిక
3) పార్లమెంటరీ తరహా ప్రభుత్వం
4) దృఢ, అదృఢ లక్షణాల మిశ్రితం
5) ప్రాథమిక హక్కులు
6) ఆదేశిక సూత్రాలు
7) ఏకకేంద్ర, సమాఖ్య లక్షణాల సమ్మేళనం
8) వయోజన ఓటు హక్కు
9) స్వతంత్ర న్యాయవ్యవస్థ
10) లౌకిక రాజ్యం
11) ప్రాథమిక విధులు

భారత రాజ్యాంగ మౌలిక లక్షణాలు

సమాఖ్య రాజ్యాంగ లక్షణాలు ఉన్నప్పటికీ పరిస్థితులకు తగ్గట్టు మార్పు చేసే అవకాశం భారత రాజ్యాంగానికి ఉంది. ఆర్టికల్ 368 కల్పించిన ఈ ప్రత్యేకతను దుర్వినియోగం చేయకుండా నిరోధించడానికి సుప్రీంకోర్టు కేశవానంద భారతి కేసులో మౌలిక లక్షణాలు అనే భావనను ప్రవచించింది. వేటిని మౌలిక అంశాలుగా పరిగణించాలో కోర్టు వివిధ తీర్పుల్లో ప్రకటించింది. కేశవానందభారతి, ఇందిరాగాంధీ (ఎలక్షన్ కేసు), మినర్వామిల్స్ కేసు.. వంటి తీర్పుల్లో రాజ్యాంగ మౌలిక అంశాలుగా సుప్రీంకోర్టు పేర్కొన్నవి:

1) రాజ్యాంగ ఆధిక్యం
2) లౌకిక స్వభావం ఉన్న రాజ్యాంగం
3) సమాఖ్య లక్షణాలు
4) ప్రజాస్వామ్య, గణతంత్ర లక్షణాలు
5) శాసన, కార్యనిర్వాహక, న్యాయవ్యవస్థల మధ్య అధికారాల విభజన
6) ప్రాథమిక హక్కులు
7) జాతి ఏకత, సమగ్రత
8) సంక్షేమ రాజ్యాన్ని నిర్దేశించే అంశాలు
9) సర్వసత్తాక స్వభావం
10) దేశ ప్రజాస్వామ్యం
11) ప్రవేశిక

దాదాపు 200 ఏళ్ల బ్రిటిష్ పాలన కింద నలిగిన దేశ ప్రజలకు సుపరిపాలన అందించే వ్యవస్థ ఏర్పాటుకు దోహదపడే అనేక అంశాలను రాజ్యాంగంలో పొందుపరిచారు. ఇలా విభిన్న అంశాల సమ్మిళితమైన భారత రాజ్యాంగం ఇతర రాజ్యాంగాలతో పోలిస్తే విశిష్టమైంది.

ఈ అంశం నుంచి వివిధ పోటీ పరీక్షల్లో వచ్చిన ప్రశ్నలు:

1. భారత రాజ్యాంగాన్ని అర్ధసమాఖ్యగా వర్ణించింది? **(గ్రూప్-2, 2008)**

ఎ) కేసీ వేర్ బి) ఆస్టిన్
సి) ఆపిల్ బి డి) మోరిస్ జోన్స్

(ఎ)

మన రాజ్యాంగం ఏకకేంద్ర, సమాఖ్య లక్షణాల సమ్మిళితం. అందుకే రాజ్యాంగం 'సమాఖ్య' అనే పదం వాడకుండా భారతదేశాన్ని 'యూనియన్ ఆఫ్ స్టేట్స్'గా ప్రకటించింది. ఈ విశిష్టతల కారణంగానే కేసీ వేర్ రాజ్యాంగాన్ని 'అర్ధసమాఖ్య'గా పిలిస్తే, గ్రాన్‌విల్లి ఆస్టిన్ 'భారత అవసరాలకు తగ్గట్టుగా మలిచిన కొత్త తరహా సమాఖ్య'గా అభివర్ణించారు.

2. న్యాయసమీక్ష అంశాన్ని ఏ దేశ రాజ్యాంగం నుంచి గ్రహించారు? **(గ్రూప్-2, 2005)**

ఎ) బ్రిటిష్ బి) అమెరికా
సి) స్విస్ డి) కెనడా

(బి)

మన రాజ్యాంగంలోని అనేక అంశాలను వివిధ దేశాల రాజ్యాంగాల నుంచి గ్రహించారు. న్యాయసమీక్ష, ప్రాథమిక హక్కులను అమెరికా, క్యాబినెట్ తరహా పార్లమెంటరీ వ్యవస్థను బ్రిటిష్, ఆదేశిక సూత్రాలను ఐర్లాండ్, ప్రాథమిక విధులను సోవియట్ యూనియన్, ఉమ్మడి జాబితా పద్ధతిని ఆస్ట్రేలియా రాజ్యాంగాల నుంచి గ్రహించారు. అందుకే మన రాజ్యాంగాన్ని కొంతమంది విమర్శకులు A bag of borrowings (కలగూరగంప)గా పేర్కొన్నారు.

3. రాజ్యాంగం ఏర్పాటు చేసిన రాజకీయ వ్యవస్థ ''పరిస్థితులకు, సమయానికి తగిన విధంగా ఏకకేంద్రం, సమాఖ్యలుగా పనిచేస్తుంది'' అని పేర్కొంది? **(గ్రూప్ -2, 2008)**

ఎ) నెహ్రూ బి) అంబేద్కర్
సి) ఆపిల్ బి డి) పటేల్

(బి)

''అమెరికాతో సహా అన్ని సమాఖ్య వ్యవస్థలు అత్యంత దృఢత్వాన్ని కలిగి, పరిస్థితులకు తగ్గట్టు మార్చడానికి వీలుపడవు. కానీ భారత రాజ్యాంగం మాత్రం పరిస్థితులకు, సమయానికి తగ్గట్టు ఏకకేంద్రం, సమాఖ్యలుగా పని చేస్తుంది. సాధారణ సమయంలో సమాఖ్య వ్యవస్థగా, యుద్ధం వంటి అత్యావసర సమయాల్లో ఏకకేంద్రంగా ఇది పని చేస్తుంది'' అని అంబేద్కర్ పేర్కొన్నారు.

4) వీటిలో భారత రాజ్యాంగంలోని మౌలికాంశం కానిది? **(గ్రూప్ - 2, 2002)**

ఎ) సమన్యాయ పాలన బి) ధర్మనిరపేక్షత
సి) స్వతంత్ర, నిష్పక్ష నిర్వచనతత్వం డి) ప్రాథమిక హక్కులు

(బి)

రాజ్యాంగంలో మౌలిక అంశాలు లేదా మౌలిక నిర్మాణం అనే వాటిని పేర్కొనలేదు. అయితే 368వ ఆర్టికల్ (రాజ్యాంగ సవరణకు లభించిన అవకాశాన్ని ఉపయోగించడం) ద్వారా రాజ్యాంగ నిర్మాతల ఆశయాలకు విరుద్ధంగా రాజ్యాంగంలో మార్పులు చేయకుండా నిరోధించడానికి సుప్రీంకోర్టు ఈ భావనను ప్రవచించింది. 1973లో కేశవానంద భారతి కేసులో మౌలిక అంశాల భావనను పేర్కొంది. వేటిని 'మౌలిక అంశాలుగా' గుర్తించవచ్చో సుప్రీంకోర్టు వివిధ తీర్పుల్లో ప్రకటిస్తోంది.

5. 'ఇంట్రడక్షన్ టు ది కాన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇండియా' గ్రంథాన్ని రచించింది? **(గ్రూప్ - 2, 2008)**

ఎ) ఎంవీ పిలే బి) హెచ్‌జే లాస్కీ
సి) డీడీ బసు డి) బీబీ తయాల్

(సి)

6. వీటిలో గ్రాన్‌విల్లి ఆస్టిన్ రచించిన గ్రంథం? **(గ్రూప్-2, 2008)**

ఎ) ఇంట్రడక్షన్ టు ద స్టడీ ఆఫ్ ద లా ఆఫ్ కాన్‌స్టిట్యూషన్
బి) ది ఇండియన్ కాన్‌స్టిట్యూషన్ - కార్నర్‌స్టోన్ ఆఫ్ ఎ నేషన్
సి) సమ్ క్యారక్టరిస్టిక్స్ ఆఫ్ ది ఇండియన్ కాన్‌స్టిట్యూషన్
డి) మోడర్న్ కాన్‌స్టిట్యూషన్స్

(డి)

ఆస్టిన్ రచించిన ఈ గ్రంథం రాజ్యాంగ సభ చరిత్రను గురించి తెలుపుతుంది. రాజ్యాంగ సభ ఏర్పాటు, చర్చలు, పరిణామాల గురించి అనేక విషయాలు గ్రంథంలో పేర్కొన్నారు. ఇందులో రాజ్యాంగ నిర్మాతల ఆలోచనలు, ఆశయాలను తెలుసుకోవచ్చు. ఆస్టిన్ రచించిన మరో గ్రంథం 'వర్కింగ్ ఎ డెమొక్రటిక్ కాన్‌స్టిట్యూషన్- ది ఇండియన్ ఎక్స్‌పీరియన్స్' 1950 నుంచి దేశంలో జరిగిన ప్రజాస్వామ్య, రాజ్యాంగ పరిణామాలను విశ్లేషిస్తుంది.

రాజ్యాంగ సంబంధిత అంశాలపై పట్టు సాధించడానికి ప్రామాణిక గ్రంథాలు చదవడంతో పాటు, ఆంగ్లంలోని సంబంధిత పదజాలాన్ని కూడా తెలుసుకోవడం మంచిది. ఏపీపీఎస్సీ పోటీ పరీక్షల్లో ప్రశ్నలను తెలుగులోకి తర్జుమా చేసేటప్పుడు ప్రామాణిక పదజాలాన్ని ఉపయోగించకపోవడం, అనువాద లోపాలు వంటివి మార్కులను, సమయాన్ని హరించకుండా ఉండాలంటే అభ్యర్థులు తగిన శ్రద్ధ వహించాలి.

భారత రాజ్యాంగ రూపకల్పన.. ముఖ్యాంశాలు

భారత రాజ్యాంగ రూపకల్పనలో అనేక అంశాలు ఇమిడి ఉన్నాయి. కేబినెట్ మిషన్ ప్రణాళికను అనుసరించి రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు నిర్వహించి అనేక కమిటీలను ఏర్పాటు చేశారు. ప్రపంచంలోని అన్ని ప్రముఖ దేశాల రాజ్యాంగాలను పరిశీలించి మన దేశ పరిస్థితులకు అనుగుణంగా రాజ్యాంగాన్ని రూపొందించారు. రాజ్యాంగ పరిషత్ నిర్మాణం, కమిటీలు, రాజ్యాంగానికి గల మూలాధారాల గురించి వివిధ పోటీ పరీక్షల్లో ప్రశ్నలు వస్తున్నాయి. కాబట్టి వాటి ప్రాముఖ్యాన్ని గుర్తించాలి.

1. భారత రాజ్యాంగ రచన ఎప్పటికి పూర్తయింది? **(గ్రూప్-1-83-84)**

ఎ) 1946 డిసెంబర్ 9 బి) 1947 ఆగస్టు 15
సి) 1949 నవంబర్ 26 డి) 1950 జనవరి 26

సమాధానం: సి

వివరణ: 1946 డిసెంబర్ 9న రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశాన్ని నిర్వహించారు. 1947 ఆగస్టు 15న మన దేశానికి స్వాతంత్ర్యం వస్తే 1949 నవంబర్ 26న రాజ్యాంగ రచన పూర్తి అయి పరిషత్ ఆమోదించింది. 1950 జనవరి 26న రాజ్యాంగం అమల్లోకి వచ్చింది.

2. భారత రాజ్యాంగ ప్రవేశికలో ఉన్న పద బంధం? **(గ్రూప్-1, 83-84)**

ఎ) సర్వసత్తాక ప్రజాస్వామ్య గణతంత్రం
బి) సర్వసత్తాక ప్రజాస్వామ్య సామ్యవాద లౌకిక గణతంత్ర రాజ్యం
సి) సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యం
డి) సర్వసత్తాక లౌకిక ప్రజాస్వామ్య, సామ్యవాద గణతంత్ర రాజ్యం

సమాధానం: సి

వివరణ: సర్వసత్తాక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా ప్రారంభంలో ఉన్న రాజ్యాంగ ప్రవేశిక లో 1976లో 42వ సవరణ ద్వారా సామ్యవాద, లౌకిక అనే పదాలను సర్వసత్తాక, ప్రజాస్వామ్య పదాల మధ్య చేర్చారు. దాంతో సర్వసత్తాక సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్యంగా మారింది.

3. ఫిబ్రవరి 21, 1948న రాజ్యాంగ సదస్సుకు సమర్పించిన భారత ముసాయిదా రాజ్యాం గంలో ఉన్నవి? **(గ్రూప్-2, 2005)**

ఎ) 315 అధికరణలు, 8 షెడ్యూళ్లు
బి) 395 అధికరణలు, 8 షెడ్యూళ్లు
సి) 399 అధికరణలు, 10 షెడ్యూళ్లు
డి) 395 అధికరణలు, 10 షెడ్యూళ్లు

సమాధానం: బి

వివరణ: 21 ఫిబ్రవరి 1948న రాజ్యాంగ పరిషత్‌కు సమర్పించిన ముసాయిదాలో 395 అధికరణలు 8 షెడ్యూళ్లు ఉన్నాయి. బి.ఎన్.రావు సమర్పించిన ముసాయిదాలో 13 షెడ్యూళ్లు ఉన్నప్పటికీ సవరించిన ముసాయిదాలో 8కి తగ్గించారు.

4. కేబినెట్ మిషన్‌ను భారత్‌కు పంపడానికి కారణం? **(గ్రూప్-2, 2003)**

ఎ) మత ఘర్షణలను అణచివేయడానికి
బి) భారత్ పాకిస్తాన్‌ల సరిహద్దులను నిర్ణయించడానికి
సి) రాజ్యాంగ సమస్యకు సరైన సమాధానం కనుగొనడానికి
డి) భారత్‌లో క్రైస్తవ మత ప్రచారానికి

సమాధానం: సి

వివరణ: 1946లో మార్చిలో భారత్‌ను సందర్శించిన కేబినెట్ మిషన్ స్వాతంత్ర్యానంతరం తమను తాము పరిపాలించుకునేందుకు రాజ్యాంగాన్ని రూపొందించడానికి అవసరమైన కమిటీ ఏర్పాటుపై ప్రతిపాదనలు చేసింది.

5. భారతదేశంలో రాజ్యాంగ పరిషత్ ఏర్పాటుకు సిఫారసు చేసిన కమిటీ? **(గ్రూప్- 2, 2003 బ్యాక్‌లాగ్)**

ఎ) మౌంట్ బాటెన్ ప్రణాళిక బి) క్రిప్స్ మిషన్
సి) కేబినెట్ మిషన్ ప్రణాళిక
డి) భారత ప్రభుత్వ చట్టం 1935

సమాధానం: సి

6. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగ పరిషత్‌కు ఎక్కడి నుంచి ఎన్నికయ్యారు? **(సివిల్స్- 1996)**

ఎ) పశ్చిమబెంగాల్ బి) ఆనాటి బొంబాయి
సి) ఆనాటి మధ్య భారత్ డి) పంజాబ్

సమాధానం: బి

వివరణ: వాస్తవంగా డాక్టర్ బీఆర్ అంబేద్కర్ బెంగాల్ నుంచి మొదట రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికయ్యారు. కానీ దేశ విభజన సందర్భంగా అంబేద్కర్ ఎన్నికైన ప్రాంతం పాకిస్థాన్‌కు బదిలీ కావడంతో తిరిగి ఆనాటి బొంబాయి రాష్ట్రం నుంచి ఎన్నికయ్యారు.

7. వీటిలో వాస్తవిక అంశం? **(సివిల్స్-2004)**

ఎ) రాజ్యాంగ పరిషత్‌ను రాష్ట్రాల్లోని శాసనసభలు 1946లో ఎన్నుకున్నాయి
బి) జవహర్‌లాల్ నెహ్రూ, మహ్మద్ అలీ జిన్నా, సర్దార్ పటేల్ రాజ్యాంగ పరిషత్ సభ్యులుగా పనిచేశారు
సి) రాజ్యాంగ పరిషత్ మొదటి సమావేశం జనవరి 1947లో జరిగింది

డి) భారత రాజ్యాంగం 26 జనవరి 1950న ఆమోదించారు

సమాధానం: ఎ

వివరణ: రాజ్యాంగ పరిషత్‌ను కేబినెట్ మిషన్ సూచనల ప్రకారం 1946 జూన్, జూలైలో రాష్ట్రాల శాసనసభలు నైష్పత్తిక ప్రాతినిధ్య పద్ధతిపై ఎన్నుకున్నాయి.

8. భారత రాజ్యాంగంలోని పీఠిక ఏ దేశ రాజ్యాంగాన్ని పోలి ఉంటుంది? (గ్రూప్-2, 2003 బ్యాక్‌లాగ్)

ఎ) ఫ్రాన్స్ బి) అమెరికా సి) కెనడా డి) ఇటలీ

సమాధానం: బి

వివరణ: మన రాజ్యాంగ లక్ష్యాలను, ఆశయాలను తెలిపే రాజ్యాంగ పీఠికను అమెరికా రాజ్యాంగం నుంచి గ్రహించాం.

9. భారత రాజ్యాంగం తన పౌరులకు హామీగా ఇచ్చిన హక్కులు? (గ్రూప్-2, 2000)

ఎ) సహజ బి) సామాజిక

సి) మూలాధార డి) ఆస్తి

సమాధానం: సి

వివరణ: భారత రాజ్యాంగం ప్రసాదించిన హక్కుల్లో సామాజిక లేదా ఆర్థిక హక్కులకు అవకాశం లేదు. సహజ హక్కులపై ఎలాంటి ప్రస్తావనలేదు. మన రాజ్యాంగం మూలాధార హక్కులను అంటే ప్రాథమిక హక్కులను ఇచ్చింది.

10.కిందివారిలో స్వాతంత్ర్యానికి పూర్వం భారత జాతీయ కాంగ్రెస్‌లో సామ్యవాద భావాలను ప్రచారం చేసింది? (సివిల్స్-2003)

ఎ) పట్టాభి సీతారామయ్య బి) జవహర్‌లాల్ నెహ్రూ

సి) సర్దార్ వల్లభాయ్ పటేల్ డి) జమన్‌లాల్ బజాజ్

సమాధానం: బి

వివరణ: పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ సామ్యవాద భావాలపై ప్రత్యేక దృష్టిని కలిగి ఉండేవారు. రష్యా అనుసరించిన సామ్యవాద ప్రణాళికా బద్ధమైన ఆర్థిక వ్యవస్థపై మక్కువతో స్వాతంత్ర్యానికి పూర్వం కాంగ్రెస్‌లో సామ్యవాద భావాలను వ్యాప్తి చేశారు.

11.భారత రాజ్యాంగాన్ని ఎవరు ఆమోదించి, సమర్పించినట్లుగా పేర్కొంటారు?

ఎ) రాజ్యాంగ పరిషత్ బి) భారత ప్రజలు

సి) భారత పార్లమెంట్ డి) బ్రిటిష్ పార్లమెంట్

సమాధానం: బి

వివరణ: భారత రాజ్యాంగాన్ని రూపొందించి ఆమోదించి, సమర్పించింది రాజ్యాంగ పరిషత్ అయినప్పటికీ ప్రవేశికలో భారత ప్రజలమైన మాకు మేము ఆమోదించుకొని సమర్పించుకునే రాజ్యాంగం అని పేర్కొన్నారు.

12.కింది వారిలో రాజ్యాంగ రచనా కమిటీలో సభ్యులు కానివారు?

ఎ) కె.ఎం. మున్షీ బి) సర్దార్ పటేల్

సి) అల్లాడి కృష్ణస్వామి అయ్యర్ డి) సయ్యద్ సాధుల్లా

సమాధానం: బి

13.కింది వాటిలో దేనినుంచి మన రాజ్యాంగం ఎక్కువ అంశాలను గ్రహించింది?

ఎ) బ్రిటిష్ రాజ్యాంగం బి) అమెరికన్ రాజ్యాంగం

సి) కెనడా రాజ్యాంగం డి) భారత ప్రభుత్వ చట్టం-1935

సమాధానం: డి

14.భారతదేశం గణతంత్ర రాజ్యం, ఎందుకంటే?

ఎ) ప్రజాభిప్రాయానికి అనుగుణంగా పాలన

బి) మతప్రసక్తి లేని రాజ్యం

సి) రాష్ట్రపతి వారసత్వంగా పదవిలోకి రాకపోవడం

డి) మన దేశం సర్వసత్తాక రాజ్యంగా కామన్‌వెల్త్‌లో చేరడం

సమాధానం: సి

రాజ్యాంగ పరిణామం

పోటీ పరీక్షలలో భారత రాజకీయ వ్యవస్థ నుంచి ప్రశ్నలు తప్పనిసరిగా అడుగుతున్నారు. ఈ విభాగంపై అభ్యర్థులు సరైన అవగాహన పెంచుకుంటే ఎక్కువ మార్కులు స్కోర్ చేసే వీలుంది. ఈ వారం ప్రస్తుత రాజకీయ వ్యవస్థ, బ్రిటీష్ పాలన ప్రభావం, భారత రాజ్యాంగ రూపకల్పనకు దారి తీసిన పరిస్థితులను అధ్యయనం చేద్దాం.

భారతదేశ సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలను బ్రిటిష్ పాలన విస్తృతంగా ప్రభావితం చేసింది. 17, 18 శతాబ్దాలలో ఈస్టిండియా కంపెనీ దక్షిణాసియాలో బ్రిటిష్ సామ్రాజ్యానికి పునాది వేసింది. 1858 భారత ప్రభుత్వ చట్టం బ్రిటిష్ రాజమకుటానికి భారత ఉపఖండం మీద సార్వభౌమాధికారాన్ని కల్పించింది. కాలానుగుణంగా కొంత సడలింపు జరిగినప్పటికీ, కేంద్రీకృత పాలనకు ఈ చట్టం నాందిపలికింది.

గవర్నర్ జనరల్-గవర్నర్:

రాజమకుట అధికారాలను భారతదేశ వ్యవహారాల కార్యదర్శి (మంత్రి), 15 మంది సభ్యులతో కూడిన ఇండియా కౌన్సిల్ సలహా మేరకు చేపట్టారు. ఈ కార్యదర్శి తరపున దేశంలో కేంద్రస్థాయిలో గవర్నర్ జనరల్, ప్రాంతీయస్థాయిలో గవర్నరు పాలనా బాధ్యతలు నిర్వహించారు. వీరికి సహాయంగా అధికారులతో కూడిన కార్యనిర్వాహక కౌన్సిల్ ఏర్పాటైంది. ఉన్నత స్థాయి అధికారులంతా ఐరోపావాళ్లే. అప్పట్లో పౌర, రక్షణ, శాసన, కార్యనిర్వాహక విధుల విషయంలో స్పష్టమైన తేడా లేదు. గవర్నర్ జనరల్, తన కార్యనిర్వాహక కౌన్సిల్ సహాయంతో పై విధులన్నింటినీ నిర్వహించేవారు. రాష్ట్ర ప్రభుత్వాలు నామమాత్రమే. భారతదేశ వ్యవహారాల కార్యదర్శి బ్రిటీష్ పార్లమెంటుకు మాత్రమే బాధ్యత వహిస్తారు. భారత ప్రజలకు జవాబుదారి కాదు. పూర్తిగా ఉద్యోగిస్వామ్యం పాలన సాగింది.

1861 భారతీయ కౌన్సిళ్ళ చట్టం:

1861 భారతీయ కౌన్సిళ్ళ చట్టం అనధికార సభ్యులకు (అంటే భారతీయులకు) గవర్నర్ జనరల్ కౌన్సిల్‌లో ప్రవేశం కల్పించింది. నామినేట్ అయిన భారతీయ సభ్యులకు పరిమితమైన శాసన సంబంధ అధికారాలు ఉండేవి. రాష్ట్రాలలో కూడా అదే మార్పు జరిగింది.

1892 కౌన్సిళ్ళ చట్టం:

1892 కౌన్సిళ్ళ చట్టం, భారత శాసన మండలికి బెంగాల్ వాణిజ్య మండలి, రాష్ట్ర శాసన మండళ్లకు భారతీయులను (అనధికార సభ్యులు) నామినేట్ చేయటానికి అవకాశం కల్పించింది. అలాగే రాష్ట్ర శాసన మండళ్లకు స్థానిక సంస్థలు, విశ్వవిద్యాలయాలు, జిల్లా బోర్డులు భారతీయులను (అనధికార సభ్యులు) నామినేట్ చేస్తాయి. కౌన్సిళ్ళకు బడ్జెట్‌ను చర్చించే అధికారం కల్పించారు.

1909 భారతీయ కౌన్సిళ్ళ చట్టం:

1909 భారతీయ కౌన్సిళ్ళ చట్టం (మార్లే-మింటో సంస్కరణలు) మొదటిసారిగా శాసనమండళ్లకు ప్రాతినిధ్య స్వభావాన్ని కల్గించింది. రాష్ట్రస్థాయిలో కౌన్సిళ్ళ సభ్యుల సంఖ్యను పెంచడంతోపాటు అనధికార సభ్యులకు మెజారిటీ కల్పించారు. అనధికార సభ్యులలో కొందరిని స్థానిక సంస్థలు, ప్రభావ వర్గాలు ఎన్నుకుంటాయి. మొదటిసారిగా ఎన్నిక విధానాన్ని ప్రవేశపెట్టారు. అయితే అల్పసంఖ్యాక వర్గాలకు కొన్ని స్థానాలు రిజర్వు చేయడం ద్వారా మత ప్రాతిపదికన ప్రాతినిధ్యానికి అంకురార్పణ జరిగింది. ఇది భవిష్యత్‌లో జరిగిన మతపరంగా భారత ఉపఖండ విభజనకు దారితీసిందని విశ్లేషకుల అభిప్రాయం.

1919 భారత ప్రభుత్వ చట్టం:

మొదటి ప్రపంచ యుద్ధ కాలంలో భారతీయులు బ్రిటిష్ ప్రభుత్వానికి అందించిన సహకారానికి కృతజ్ఞతగా మరిన్ని అభ్యుదయ అంశాలతో కూడిన 1919 భారత ప్రభుత్వ చట్టాన్ని బ్రిటిష్ పార్లమెంటు ఆమోదించింది. ఈ చట్టం మొదటిసారిగా, రాష్ట్రస్థాయిలో పార్లమెంటరీ ప్రజాస్వామ్య ప్రభుత్వఏర్పాటుకు పాక్షికంగా అనుమతించింది.ఈ చట్టం ప్రకారం : ఎ) రాష్ట్రాలలో ద్వంద్వ ప్రభుత్వ ఏర్పాటు - రాష్ట్ర గవర్నరు కొన్ని శాఖలను శాసనమండలి సభ్యులైన మంత్రుల ద్వారా (ట్రాన్స్ ఫర్డ్ శాఖలు) నిర్వహిస్తే, మరికొన్ని శాఖలను కార్యనిర్వాహక సభ్యుల ద్వారా (రిజర్వ్‌డ్ శాఖలు) నిర్వహిస్తారు. బి) కేంద్ర రాష్ట్రాల మధ్య అధికార విభజన సి) 70 శాతం రాష్ట్ర శాసన మండలి సభ్యులను ఓటర్లద్వారా ప్రత్యక్షంగా ఎన్నుకోవాలి. డి) రాష్ట్రాల మీద కేంద్ర నియంత్రణ సడలింపు ఇ) కేంద్రంలో ద్వంద్వ శాసన సభ ఏర్పాటు. ఎగువ, దిగువ సభలలో ఎన్నికైన సభ్యుల మెజారిటీ. అయితే మత ప్రాతిపదికన కొన్ని స్థానాలు రిజర్వు చేశారు. గవర్నర్-జనరల్‌కు కేంద్ర శాసన సభను నియంత్రించి, అవి ఆమోదించిన బిల్లులను తిరస్కరించే అధికారం కల్పించింది.

1919 భారత ప్రభుత్వ చట్టం, భారత ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా లేదు. పైగా అశాస్త్రీయమైన ద్వంద్వ ప్రభుత్వం, రాష్ట్రస్థాయిలో లేనిపోని సమస్యలు తెచ్చింది. ఈ చట్ట పనితీరును సమీక్షించ

టానికి ఏర్పాటైన సైమన్ కమిషన్ (1927-30) దీనిని రద్దు చేయాలని సిఫారసు చేసింది. 1930, 1931, 1932లలో జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశాలు సైమన్ కమిషన్ నివేదికను చర్చించాయి. ఈ సమావేశాలకు బ్రిటిష్, భారత రాజకీయ నాయకులు హాజరయ్యారు.

1935 భారత ప్రభుత్వ చట్టం:

1935 భారత ప్రభుత్వ చట్టం ఆధునిక భారత రాజకీయ చరిత్రలో ఒక ప్రధాన ఘట్టం. దీని ముఖ్యాంశాలు.. ఎ) బ్రిటిష్ పాలిత రాష్ట్రాలు, స్వదేశ సంస్థానాలతో కలిసి అఖిలభారత సమాఖ్య ఏర్పాటు బి) ఫెడరల్ (కేంద్రం) స్థాయిలో ద్వంద్వ ప్రభుత్వ ఏర్పాటు. ఈ రెండు అంశాలు అమలులోకి రాలేదు. సి) రాష్ట్రాలలో ద్వంద్వ పాలన స్థానంలో పూర్తి బాధ్యతాయుత ప్రభుత్వం. డి) కేంద్ర, రాష్ట్రాల మధ్య స్పష్టమైన అధికార విభజనకు ఫెడరల్, ఉమ్మడి రాష్ట్ర జాబితాల ఏర్పాటు.

(ఇ) ఆరు బ్రిటిష్ పాలితా రాష్ట్రాల్లో ద్వంద్వ శాసనసభ ఏర్పాటు

(ఎఫ్) ఇండియా కౌన్సిల్ రద్దు

(జి) కేంద్ర, రాష్ట్ర శాసనసభలకు మరిన్ని అధికారాలు

(హెచ్) ఫెడరల్ కోర్టు ఏర్పాటు

(ఐ) ఫెడరల్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ల ఏర్పాటు

సైమన్ కమిషన్ సిఫార్సుల మేరకు భారతదేశానికి డొమినియన్ ప్రతిపత్తి ఈ చట్టం కింద కల్పించలేదు. అయితే ఈ చట్టంలో అనేక అంశాలు భారత రాజ్యాంగంలో చోటుచేసుకొన్నాయి. ఉదా: బలమైన కేంద్రప్రభుత్వం (అర్ధ సమాఖ్య) పార్లమెంటరీ ప్రజాస్వామ్య వ్యవస్థ, మూడురకాలైన జాబితాల ద్వారా కేంద్ర-రాష్ట్రాల మధ్య అధికార విభజన మొదలైనవి. రెండు సంవత్సరాల తర్వాత 1935 భారత ప్రభుత్వచట్టం అమల్లోకి వచ్చింది.

రెండవ ప్రపంచయుద్ధం:

1939లో రెండవ ప్రపంచయుద్ధం ప్రారంభమైంది. భారతదేశ ప్రజలను సంప్రదించకుండా ఇండియాను జర్మనీకి శత్రుదేశంగా ప్రకటించడం పట్ల నిరసనగా కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాలు (రాష్ట్రస్థాయిలో) రాజీనామా చేశాయి.

గాంధీజీ 1942లో 'క్విట్ ఇండియా' ఉద్యమాన్ని ప్రారంభించి ఆంగ్లేయులను భారతదేశం నుంచి నిష్క్రమించమని కోరారు. యుద్ధ సమయంలో భారతదేశ ప్రజల సహకారాన్ని పొందడానికి బ్రిటిష్ ప్రభుత్వం క్రిప్స్ రాయబారం, వీవెల్ పథకం ప్రతిపాదనలు చేసింది. రెండవ ప్రపంచయుద్ధం బ్రిటన్, దాని మిత్రదేశాలకు అనుకూలంగా ముగిసింది.

1945లో బ్రిటన్‌లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో లేబర్ పార్టీ అధికారంలోకి వచ్చింది. ప్రధాని అట్లీ భారతదేశానికి స్వాతంత్ర్యమివ్వడానికి సూత్రప్రాయంగా అంగీకరించారు. అధికార బదిలీకి సంబంధించిన అంశాలను చర్చించడానికి పెథిక్ లారెన్స్, స్టాఫర్ క్రిప్స్, ఎ.వి. అలెగ్జాండర్ ముగ్గురు కేబినెట్ మంత్రులు 1946లో భారతదేశాన్ని సందర్శించారు.

జాతీయోద్యమం.. రాజ్యాంగంపై ప్రభావం

జాతీయ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన జాతీయ నాయకుల ఆదర్శాలు, లక్ష్యాలు, ఆశయాలు భారత రాజ్యాంగంలో చోటుచేసుకున్నాయి. భారత జాతీయ ఉద్యమంలోని అనేక దశలు మన రాజ్యాంగాభివృద్ధిపై ప్రభావాన్ని చూపుతున్నాయి.

1. గాంధీ పౌరశాసన ఉల్లంఘన ఉద్యమాన్ని ప్రారంభించిన సంవత్సరం? (గ్రూప్-2, 2003)

ఎ) 1920 బి) 1930 సి) 1942 డి) 1932

- 1930లో గాంధీ సివిల్ డిస్ ఒబిడియన్స్ ఉద్యమాన్ని ప్రారంభించారు. ఉప్పుపై పన్ను వేస్తూ చేసిన శాసనాన్ని ఉల్లంఘించడం వల్ల దీనికి ఉప్పు సత్యాగ్రహం అని పేరు. గుజరాత్‌లోని దండి గ్రామం నుంచి ఉద్యమాన్ని ప్రారంభించడంతో దండి సత్యాగ్రహం అని దీనికి మరోపేరు.

2. బెంగాల్ విభజన జరిగిన సంవత్సరం?

ఎ) 1903 బి) 1905 సి) 1906 డి) 1907

- లార్డ్ కర్జన్ బెంగాల్‌ను రెండుగా విభజించారు. విభజించి పాలించు అనే విధానంలో భాగంగా చేసిన ఈ విభజనను వ్యతిరేకిస్తూ వందేమాతరం ఉద్యమం జరిగింది.

3. గాంధీ ఏ సంవత్సరంలో సహాయ నిరాకరణ ఉద్యమాన్ని ప్రారంభించారు? (గ్రూప్-2, 2000)

ఎ) 1919 బి) 1930 సి) 1920 డి) 1935

- బాలగంగాధర్ తిలక్ మరణానంతరం గాంధీ జాతీయ ఉద్యమానికి నాయకత్వం వహించి నిర్వహించిన మొదటి జాతీయ స్థాయి ఉద్యమం ఇది. 1922లో చౌరాచౌరీ వద్ద జరిగిన హింసాత్మక సంఘటనను దృష్టిలో ఉంచుకొని ఈ ఉద్యమాన్ని విరమించారు.

4. భారత జాతీయ కాంగ్రెస్ స్థాపించిన సంవత్సరం? (గ్రూప్-2, 2003)

ఎ) 1857 బి) 1885 సి) 1907 డి) 1920

- భారత స్వాతంత్ర్య ఉద్యమానికి నాయకత్వం వహించిన భారత జాతీయ కాంగ్రెస్ 1885లో బ్రిటిష్ అధికారి ఏ.ఓ.హ్యూం నేతృత్వంలో స్థాపించారు. మొదటి సమావేశం బొంబాయిలో జరిగింది అధ్యక్షులు డబ్ల్యు.సి. బెనర్జీ.

5. కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్ ఏర్పడిన సంవత్సరం? (గ్రూప్ - 2, 2000)

ఎ) 1920 బి) 1921 సి) 1950 డి) 1953

- కేంద్ర శాసనసభలో ద్విసభలను 1919 చట్టం ద్వారా ఏర్పాటు చేశారు. కానీ ఈ చట్టం 1921లో అమల్లోకి రావడంవల్ల ఎగువసభ అయిన కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్(నేటి మన రాజ్యసభ)ను 1921లో ఏర్పాటు చేశారు.

6. కిందివాటిని సరిగా జతచేసి జాబితాల కింద ఇచ్చిన సంకేతాల నుంచి సరైన సమాధానం ఎంపిక చేయండి? (సివిల్స్ - 2003)

ఎ) భారత ప్రభుత్వ చట్టం, 1935	1) అధికారాన్ని ఈస్టిండియా కంపెనీ నుంచి బ్రిటిష్ సలహా సంఘానికి బదిలీ చేయడం
బి) భారత ప్రభుత్వ చట్టం, 1929	2) భారతదేశానికి అధినివేశ ప్రతిపత్తి కల్పించడం
సి) భారత ప్రభుత్వ చట్టం, 1919	3) ప్రొవెన్షియల్ అటానమీ ప్రవేశపెట్టడం
డి) భారత ప్రభుత్వ చట్టం, 1958	4) రాష్ట్రాల్లో ద్వంద్వ పాలన ప్రవేశపెట్టడం
	5) ముస్లింలు, ఇతరులకు ప్రత్యేక ఎలెక్టోరేట్‌ను ప్రవేశపెట్టడం

	ఎ	బి	సి	డి
1)	1	4	2	3
2)	3	5	4	1
3)	1	5	4	3
4)	3	4	2	1

- భారతదేశంలో ప్రవేశపెట్టిన చట్టాలన్నింటిలో దేనిలో కూడా బ్రిటిషర్లు అధినివేశ ప్రతిపత్తిని ప్రవేశపెట్టలేదు. 1940, 1942లో చేసిన ప్రతి పాదనల్లో మాత్రమే పేర్కొన్నారు.

7. భారత రాజ్యకార్యదర్శి పదవిని ఏర్పాటు చేసిన చట్టం?

ఎ) 1861 కౌన్సిల్ చట్టం బి) 1858 భారత ప్రభుత్వ చట్టం
సి) 1892 కౌన్సిల్ చట్టం డి) 1909 కౌన్సిల్ చట్టం

- 1858లో విక్టోరియా మహారాణి ప్రకటనగా పేర్కొనే ఈ చట్టం ద్వారా ఈస్టిండియా కంపెనీ పాలనను రద్దు చేసి బ్రిటిష్ ప్రభుత్వమే ప్రత్యక్షంగా మన దేశ పరిపాలనను చేపట్టింది. లండన్‌లో మన దేశపరిపాలనకు సంబంధించిన వ్యవహారాలను పర్యవేక్షించి బ్రిటిష్ పార్లమెంట్‌కు బాధ్యత వహించే భారత రాజ్యకార్యదర్శి పదవిని ఏర్పాటు చేశారు.

8. క్రిప్స్ రాయబారం ముఖ్య ఉద్దేశ్యం? (సివిల్స్ - 2003)

ఎ) అన్ని రాష్ట్రాలు భారత యూనియన్‌లో చేరితే ఏ విధమైన స్వయం ప్రతిపత్తినైనా భారతదేశానికి కల్పించొచ్చు
బి) రెండో ప్రపంచ యుద్ధం తరువాత భారతీయులకు డొమినియన్ ప్రతిపత్తి కల్పించడం
సి) రెండో ప్రపంచ యుద్ధంలో భారత ప్రజలు, రాజకీయ పార్టీలు బ్రిటన్‌కు సహకరిస్తే ప్రపంచ యుద్ధం తరువాత

భారత్‌కు సార్వభౌమాధికారంతో స్వాతంత్ర్యాన్ని ప్రసాదిస్తామని ప్రతిపాదన.

డి) భారత్‌లోని ఏ రాష్ట్రానికీ ప్రత్యేక రాజ్యాంగం లేకుండా మొత్తం భారత యూనియన్‌కు ఒక రాజ్యాంగాన్ని రూపొందించి అన్ని రాష్ట్రాలతో ఆమోదింపచేయడం

- రెండో ప్రపంచ యుద్ధంలో భారతీయుల సహకారాన్ని ఆశించి బ్రిటిషర్లు సర్ స్టాఫర్డ్ క్రిప్స్ ద్వారా ఈ ప్రతిపాదన చేశారు. పరిమిత అధికారాలతో కూడిన డొమినియన్ స్టేటస్ (పాక్షిక స్వాతంత్ర్యం) ప్రసాదిస్తామని ప్రతిపాదించారు కానీ పూర్తి స్వాతంత్ర్యం గురించి పేర్కొలేదు.

9. జలియన్ వాలాబాగ్ మారణహోమానికి ముందుగా జరిగిన అతి ముఖ్యమైన సంఘటన? (ఎఫ్ఆర్ఓ - 2005)

ఎ) సైమన్ కమిషన్ రాక

బి) రౌలత్ చట్టాన్ని ప్రవేశపెట్టడం

సి) కమ్యూనల్ అవార్డ్‌ను ప్రకటించడం

డి) క్విట్ ఇండియా ఉద్యమం

- బ్రిటిషర్లు ప్రవేశపెట్టిన రౌలత్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ చేసిన ప్రకటన వల్ల పంజాబ్ ప్రముఖ వ్యక్తి సత్యపాల్ కిచ్లూను అరెస్ట్ చేయడాన్ని జలియన్ వాలాబాగ్ పార్క్‌లో శాంతియుతంగా సమావేశమైన భారతీయులపై ఎలాంటి హెచ్చరిక లేకుండానే జనరల్ డయ్యర్ కాల్పులు జరిపి మారణహోమానికి పాల్పడ్డారు.

10. 1939లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యులందరూ మూకుమ్మడిగా రాజీనామా చేయడానికి దారితీసిన ముఖ్య కారణం? (ఎఫ్ఆర్ఓ - 2005)

ఎ) విభజించి పాలించు అనే బ్రిటిష్ నినాదం

బి) భారతీయులను సంప్రదించకుండా బ్రిటిషర్లు రెండో ప్రపంచ యుద్ధంలోకి లాగడం

సి) ప్రావిన్స్‌ల దైనందిన పాలనలో గవర్నర్ల మితిమీరిన జోక్యం

డి) ప్రొవిజినల్ అటానమీ నిజమైన అటానమీ కాకపోవడం

- రెండో ప్రపంచ యుద్ధ కాలంలో బ్రిటిషర్లు భారతీయులను సంప్రదించకుండానే బ్రిటన్ తరపున భారత్ జర్మనీకి వ్యతిరేకంగా రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొంటుందని ప్రకటించడానికి నిరసనగా మంత్రులందరూ రాజీనామా చేశారు.

11. క్విట్ ఇండియా ఉద్యమం జరిగిన సంవత్సరం? (గ్రూప్ - 2, 2003)

ఎ) 1931 బి) 1942 సి) 1941 డి) 1943

12. 'స్వరాజ్యం అడగనిదే బ్రిటిష్ పార్లమెంట్ ఇచ్చే బహుమతి కాదు అది భారతదేశం సంపూర్ణ, స్వయంగా వెలిబుచ్చే ప్రకటన' వ్యాఖ్యను చేసినవారు? (గ్రూప్-1, 1999)

ఎ) జవహర్‌లాల్ నెహ్రూ బి) బి.జి. తిలక్

సి) మహాత్మాగాంధీ డి) జి.కె. గోఖలే

13. భారత రాజ్యాంగ పరిషత్‌కు ఎన్నికలు జరిగిన పద్ధతి? (గ్రూప్-2, 1992)

ఎ) సార్వత్రిక పద్ధతి బి) సమాన ఓటుహక్కు పద్ధతి

సి) మత ప్రాతిపదిక డి) పరిమిత ఓటు హక్కు

- రాజ్యాంగ పరిషత్ ఎన్నికల్లో ముస్లింలు, సిక్కులకు మతప్రాతిపదికపై ప్రత్యేక రిజర్వేషన్లు కల్పించారు.

14. భారత రాజ్యాంగాన్ని రూపొందించిన రాజ్యాంగ పరిషత్ ఏ కమిటీ ప్రణాళికను అనుసరించి ఏర్పడింది?

ఎ) ఆగస్టు ప్రతిపాదనలు బి) క్రిప్స్ ప్రతిపాదనలు

సి) క్యాబినెట్ మిషన్ ప్రణాళిక

డి) లార్డ్ మౌంట్ బాటన్ పథకం

15. భారత రాజ్యాంగ రచనలో రాజ్యాంగ పరిషత్‌కు మార్గదర్శక సూత్రాలుగా పనిచేసేవి?

ఎ) సమన్వయం, సర్దుబాటు

బి) సామ్యవాదం, ప్రణాళికా విధానం

సి) ఏకత, జాతీయ ప్రయోజనం

డి) ప్రజాస్వామ్యం - సామ్యవాదం

- పైన పేర్కొన్న భావనలు మొత్తం రాజ్యాంగంపై ప్రభావం చూపినప్పటికీ రచనలో కీలక పాత్ర వహించిన సూత్రం మాత్రం సమన్వయం, సర్దుబాటు. ఉదా. దృఢ, అదృఢ లక్షణాల కలయిక, ఏకకేంద్ర - సమాఖ్య లక్షణాల కలయిక.

16. భారత రాజ్యాంగ పరిషత్ రాజ్యాంగంలో పొందుపర్చిన అంశాలపై నిర్ణయం తీసుకునే విధానం?

ఎ) మెజారిటీ ఓటు ద్వారా బి) సమన్వయం ద్వారా

సి) 2/3 మెజారిటీ పద్ధతి ద్వారా డి) ఏకగ్రీవంగా

సమాధానాలు

1 బి	2 బి	3 సి	4 బి	5 బి
6 బి	7 బి	8 బి	9 బి	10 బి
11 బి	12 సి	13 సి	14 సి	15 ఎ
16 బి				

భారత రాజ్యాంగ చట్టాలు.. పరిణామాలు..

ప్రపంచంలోనే గొప్పదిగా వర్ణించే భారత రాజ్యాంగంపై బ్రిటిష్ కాలంలో ప్రవేశపెట్టిన అనేక చట్టాల ప్రభావముంది. 1773 రెగ్యులేటింగ్ చట్టం నుంచి 1947 భారత స్వాతంత్ర్య చట్టం వరకు అనేక దశల్లో మన రాజ్యాంగం పరిణామం చెందింది. స్వప్రయోజనాల సంరక్షణ కోసం ఆంగ్లేయులు చట్టాలను ప్రవేశపెట్టినప్పటికీ.. స్వాతంత్ర్యానంతరం మన రాజ్యాంగ నిర్మాతలు దేశ పరిస్థితులకు అనుగుణంగా ఆయా చట్టాల్లోని ప్రయోజనకర అంశాలను గ్రహించారు. ఈస్టిండియా కంపెనీ పాలనాకాలంలో ప్రవేశపెట్టిన చార్టర్ చట్టాలు, ఆంగ్లేయుల ప్రత్యక్ష పాలనలో రూపొందించిన కౌన్సిల్ చట్టాలు మన రాజ్యాంగానికి పునాదులుగా తోడ్పడ్డాయి. 1935 భారత ప్రభుత్వ చట్టాన్ని భారత రాజ్యాంగానికి మాతృకగా పేర్కొంటారు. రాజ్యాంగం పరిణామ దశలుగా పేర్కొనే ఈ చట్టాల నుంచి ప్రశ్నలు వివిధ పోటీ పరీక్షల్లో అగ్రభాగాన్నే ఆక్రమిస్తున్నాయి.

1. బ్రిటిష్ ప్రభుత్వం భారతదేశంలో ప్రవేశపెట్టిన ఏ చట్టం ద్వారా వైస్రాయ్ ఆధిపత్యాన్ని, వారి కార్యనిర్వాహక మండలిపై పోర్ట్ పోలియో విధానం ద్వారా నెలకొల్పారు?

(సివిల్స్ - 2002)

ఎ) 1861 కౌన్సిల్ చట్టం
బి) 1885 భారత ప్రభుత్వ చట్టం
సి) 1892 కౌన్సిల్ చట్టం
డి) 1909 కౌన్సిల్ చట్టం

1859లో ప్రవేశపెట్టిన పోర్ట్ పోలియో (శాఖల కేటాయింపు) విధానానికి లార్డ్ కానింగ్ 1861 కౌన్సిల్ చట్టం ద్వారా చట్ట బద్ధత కల్పించారు.

2. బ్రిటిష్ ప్రభుత్వం తూర్పు ఇండియా కంపెనీ డైరెక్టర్ల నుంచి భారతదేశ పాలనను ఎప్పుడు స్వీకరించింది? (గ్రూప్ - 1, 1991)

ఎ) 1833 బి) 1853 సి) 1858 డి) 1909

1857 సిపాయిల తిరుగుబాటు తరువాత 1858లో ఇంగ్లండ్ విక్టోరియా మహారాణి చేసిన ప్రకటన ద్వారా భారత్‌లో ఈస్టిండియా కంపెనీ పాలనకు స్వస్తి పలికి, పరిపాలనను స్వయంగా బ్రిటిష్ ప్రభుత్వమే స్వీకరించింది.

3. భారతీయ రాష్ట్రాల్లో స్వీయ శాసన నిర్మాణ అధికారం లేకుండా చేసిన చట్టం?

(సివిల్స్ - 1996)

ఎ) 1813 బి) 1833 సి) 1853 డి) 1861

1853 చట్టం ద్వారా కేంద్రంలో లెజిస్లేటివ్ కౌన్సిల్‌ను ఏర్పాటు చేశారు. దేశం మొత్తానికి వర్తించే శాసనాలు చేసే అధికారం ఈ కౌన్సిల్‌కు కల్పించారు.

4. భారత ప్రభుత్వ చట్టాల్లో కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఏర్పాటుకు అవకాశం కల్పించిన చట్టం? (గ్రూప్ - 2, 2000)

ఎ) 1892 కౌన్సిల్ చట్టం
బి) భారత ప్రభుత్వ చట్టం, 1909
సి) భారత ప్రభుత్వ చట్టం, 1919
డి) భారత ప్రభుత్వ చట్టం, 1935

1919 మాంటేగ్- ఛేమ్స్‌ఫర్డ్ సంస్కరణల ద్వారా ఉన్నతోద్యోగుల ఎంపిక కోసం ప్రత్యేక కమిషన్ ఏర్పాటుకు అవకాశం కల్పించారు. 1921లో ఏర్పడిన లీ కమిషన్ సూచనలను అనుసరించి 1926లో కేంద్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్‌ను ఏర్పాటు చేశారు.

5. 1919 చట్టంలోని ద్వంద్వ ప్రభుత్వ వ్యవస్థ గురించిన వ్యాఖ్యల్లో సరైంది? (సివిల్స్ - 1999)

ఎ) రాష్ట్రాల్లో కౌన్సిలర్లు రాష్ట్ర శాసన వ్యవస్థకు బాధ్యత వహిస్తారు
బి) బాధ్యతాయుత ప్రభుత్వం దిశలో ఇది ముందడుగు
సి) ప్రభుత్వానికి నామమాత్ర అధిపతి ఉంటాడు
డి) ఏదీ కాదు

1919 చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వ అధికారాలను రిజర్వ్‌డ్, ట్రాన్స్‌ఫర్డ్ శాఖలుగా విభజించారు. ట్రాన్స్‌ఫర్డ్ శాఖల్లోని అంశాలపై భారతీయ మంత్రులకు అధికారం కల్పించి, వారు రాష్ట్ర శాసనసభకు బాధ్యత వహించే ఏర్పాటు చేశారు.

6. ముస్లింలను వేరుచేసి పాకిస్థాన్ కావాలనే డిమాండ్‌ను స్పష్టం చేసిన అంశం? (సివిల్స్ - 1999)

ఎ) ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను ప్రవేశపెట్టడం
బి) రాష్ట్రీయ ప్రభుత్వాల్లో ముస్లిం వ్యవస్థ
సి) రాష్ట్రీయ ప్రభుత్వాల్లో ముస్లింలను చేర్చు కోకపోవడం
డి) 1935 చట్టం కింద భావించిన సమాఖ్య నిబంధనలు

1909లో మింటో-మార్లే సంస్కరణల ద్వారా ఆంగ్లేయులు ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలు అనే భావనను ప్రవేశపెట్టారు. ఇది విభజించి పాలించడంలో ఒక భాగం. అదే భారతదేశ విభజనకు దారితీసింది.

7. భారతదేశంలో ప్రవేశపెట్టిన ఏ చట్టం ద్వారా దేశంలో మొదటి సారిగా ప్రాతినిధ్య స్వభావం, ప్రజాభిప్రాయ నీడలు పరిపాలనలో చోటు చేసుకొన్నాయి?

ఎ) 1892 బి) 1909 సి) 1919 డి) 1935

1909 చట్టం ద్వారా దేశంలో తొలిసారిగా ఓటు హక్కును ప్రవేశపెట్టారు. పరిమిత ప్రాతిపదికపై ప్రతినిధులను ఎన్నుకొనే అవకాశం ప్రజలకు కల్పించారు.

8. భారతదేశంలో ప్రవేశపెట్టిన వాటిలో దేశ శాసన వ్యవస్థలో ద్విసభా విధానాన్ని ప్రవేశపెట్టిన చట్టం?

ఎ) 1909 కౌన్సిల్ చట్టం బి) 1919 కౌన్సిల్ చట్టం
సి) 1935 భారత ప్రభుత్వ చట్టం
డి) 1947 భారత స్వాతంత్ర్య చట్టం

కేంద్ర శాసన శాఖను ద్విసభా విధానంగా 1919 కౌన్సిల్ చట్టం ద్వారా ఏర్పాటు చేశారు. ఎగువసభను కౌన్సిల్ ఆఫ్ స్టేట్స్‌గా, దిగువ సభను లెజిస్లేటివ్ అసెంబ్లీగా ఏర్పరిచారు.

9. మొదటిసారిగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికారాలను వేరు చేసి, ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన చట్టం?

ఎ) 1935 భారత ప్రభుత్వ చట్టం

బి) 1919 కౌన్సిల్ చట్టం

సి) 1909 కౌన్సిల్ చట్టం

డి) 1947 భారత స్వాతంత్ర్య చట్టం

1919 చట్టం ద్వారా మన దేశంలో తొలిసారిగా స్థూలంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మధ్య అధికార విభజన చేశారు.

10.1935 భారత ప్రభుత్వ చట్టంలోని ముఖ్యాంశం?

(గ్రూప్ – 1, 1991)

ఎ) రాష్ట్రాల ఏర్పాటు బి) వయోజన ఓటింగ్ హక్కు

సి) రాష్ట్రాలకు స్వయం ప్రతిపత్తి డి) ప్రత్యేక ఓటింగ్

సమాధానం: (సి)

1919 చట్టం ద్వారా రాష్ట్రాల్లో ప్రవేశపెట్టిన ద్వంద్వ ప్రభుత్వాన్ని రద్దుచేసి రిజర్వ్‌డ్, ట్రాన్స్‌ఫర్ జాబితాల్లోని అన్ని అంశాలపై భారతీయ మంత్రులకు అధికారం కల్పించారు.

11.వీటిలో భారత ప్రభుత్వ చట్టం 1935 లక్షణం కానిది?

(సివిల్స్ – 2000)

ఎ) కేంద్రం, ప్రావిన్సుల్లో ద్వంద్వ ప్రభుత్వ విధానం

బి) ఉభయ శాసనసభలు

సి) ప్రాంతీయ స్వయం ప్రతిపత్తి

డి) భారతీయ సమాఖ్య విధానం

1935 చట్టం ద్వారా కేంద్రంలో మాత్రమే ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టారు. రాష్ట్రాల్లోని ద్వంద్వ పాలనను ఈ చట్టం ద్వారా రద్దు చేసి వాటికి స్వయం ప్రతిపత్తి కల్పించారు.

12. ద్వంద్వ పరిపాలనా విధానంలో ప్రాంతీయ ప్రభుత్వాలకు ఎక్కువ అధికారాలు ఇచ్చింది?

ఎ) ఇండియన్ కౌన్సిల్ చట్టం 1892

బి) భారత ప్రభుత్వ చట్టం 1909

సి) భారత ప్రభుత్వ చట్టం 1919

డి) గాంధీ – ఇర్విన్ ఒడంబడిక

1919 చట్టం ద్వారా రాష్ట్ర ప్రభుత్వాలకు 24 అంశాలపై అధికారాలను కల్పించడం ద్వారా మొదటిసారిగా రాష్ట్రాలకు ఎక్కువ అధికారాలు సొంతమయ్యాయి.

13.వీటిలో 1919 చట్టం ద్వారా ప్రవేశపెట్టిన ద్వంద్వ పాలన విధానంలో మార్పునకు సిఫార్సు చేసిన కమిటీ?(సివిల్స్ – 1996)

ఎ) మద్దీమన్ బి) సప్రూ

సి) సైమన్ కమిషన్ డి) బఫ్లర్ కమిషన్

1928లో భారతదేశాన్ని సందర్శించిన సైమన్ కమిషన్ 1919 చట్టం అమలు తీరును పర్యవేక్షిస్తూ.. ద్వంద్వ పాలనను రద్దు చేయాలని సూచించింది.

14.1935 భారత ప్రభుత్వ చట్టాన్ని కొత్త బాండేజ్ చార్టర్‌గా వర్ణించింది? (1998 సివిల్స్)

ఎ) మహాత్మా గాంధీ బి) జవహర్‌లాల్ నెహ్రూ

సి) సర్దార్ పటేల్ డి) రాజేంద్రప్రసాద్

ఎలాంటి అధికారాలనూ భారతీయులకు బదిలీ చేయకుండా బ్రిటిష్ గవర్నర్ జనరల్‌కు తిరుగులేని అధికారాలు కల్పించిన 1935 చట్టం నూతన బానిసత్వానికి ఒక నాందిగా నెహ్రూ వర్ణించారు.

15.వీటిలో 1919 చట్టంలోని ప్రధాన లక్షణాలు? (సివిల్స్ – 1997)

ఎ) రాష్ట్రాల కార్యనిర్వాహక ప్రభుత్వంలో ద్వంద్వ పాలనను ప్రవేశపెట్టడం

బి) ముస్లింలకు విడిగా మతపరమైన నియోజకవర్గాలను ప్రవేశపెట్టడం

సి) కేంద్ర, రాష్ట్రాలకు శాసనపరమైన అధికారాన్ని దత్తం చేయడం

డి) కేంద్ర – రాష్ట్ర శాసన వ్యవస్థల విస్తరణ, పునర్ వ్యవస్థీకరణ

ఎ) ఎ, బి, సి బి) బి, సి, డి

సి) ఎ, బి, డి డి) ఎ, సి, డి

ముస్లింలకు ప్రత్యేక నియోజకవర్గాలను 1909 చట్టం ద్వారానే కల్పించారు. అందువల్ల బి సమాధానం తప్ప మిగతావన్నీ వాస్తవమే.

16.ఆంగ్లేయులు గుడ్ గవర్నెన్స్ ఇన్ ఇండియాగా వర్ణించిన చట్టం?

ఎ) 1858 బి) 1861 సి) 1935 డి) 1919

1858 చట్టం ద్వారా విక్టోరియా మహారాణి కంపెనీ పాలనకు స్వస్తి పలికి, ప్రత్యక్ష పాలనను స్వీకరించారు. అందుకే ఈ చట్టాన్ని పై విధంగా పేర్కొంటారు.

17.800 ఏళ్ల చరిత్ర ఉన్న బ్రిటిష్ పార్లమెంట్ ఆమోదించిన చట్టాల్లో అతి పెద్దది?

ఎ) అమెరికా స్వాతంత్ర్య చట్టం బి) భారత స్వాతంత్ర్య చట్టం

సి) 1935 భారత ప్రభుత్వ చట్టం డి) ఏదీ కాదు

సమాధానం: (సి)

18.గవర్నర్ జనరల్ కార్యనిర్వాహక మండలిలో భారతీయులకు మొదటిసారి ప్రాతినిధ్యం కల్పించిన చట్టం?

ఎ) 1861 కౌన్సిల్ చట్టం బి) 1892 కౌన్సిల్ చట్టం

సి) 1909 కౌన్సిల్ చట్టం డి) 1919 కౌన్సిల్ చట్టం

1909 మింటో – మార్లే సంస్కరణల ద్వారా గవర్నర్ జనరల్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌లో సత్యేంద్ర ప్రసాద్ సిన్హాకు మొదటిసారి ప్రాతినిధ్యం కల్పించారు.